కథ

# విషోదయం

రఘువేంద్ర శ్రీనివాస్

నరసరావుపేట,
**ది. 31.08.1998**

చిరంజీవియగు రామచంద్రమూర్తికి,

మిమ్ములను ఆయురారోగ్య ఐశ్వర్యాలతో దీవించి నాన్న వ్రాయునది. యిక్కడ మేమంతా క్షేమం. నువ్వు, కోడలు, బాబు క్షేమమని తలుస్తాను.

ముఖ్యంగా వ్రాసేది. నేను ఈరోజు సాయంత్రం రిటైర్ అవుతున్నాను. ఈ సందర్భంలో నువ్వు కూడా యిక్కడ వుంటే ఎంతో బాగుండేదని, మీ అమ్మ ఆశపడింది. కానీ, దూరాభారం కదా! అమెరికా నుంచి యిక్కడికి వచ్చి వెళ్లాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందని నేను సర్దిచెప్పాను. పెన్షను అదీ సెటిల్ కావాలంటే బహుశా రెండు మూడు నెలలు పట్టొచ్చును. ఈలోగా నువ్వు కొంచెం ఆర్థికంగా ఆదుకుంటావని ఆశిస్తున్నాను. నీ అన్నయ్య ఆర్థికపరిస్థితి నీకు తెలుసుకదా! ఎం.బి.బి.ఎస్. డాక్టర్లకు యిదివరకున్నంత డిమాండ్ లేదు. ఎం.ఎస్‌లు. ఎండి.లు వచ్చాక పరిస్థితి మరీ తీసి కట్టయింది.

అమ్మ ఆరోగ్యం బాగానే వుంది. నాకే కొంచెం ఈ మధ్య ఒంట్లో నలతగా వుంటోంది. అంత కంగారు పడవలసిందేమీలేదు. మీరు ఇండియా ఎప్పుడు వస్తారు? మీ అమ్మ ఎప్పుడూ నిన్నే తలుచుకుంటుంది. వీలు చూసుకొని ఒక్కసారి వచ్చి వెళ్లు.

కోడలికి, బాబుకు మా ఆశీస్సులు. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో గలవు. తిరిగి జవాబు రాయగలవు.

ఆశీస్సులతో
మీ నాన్న.

★★★




ది. 30.10.1998

వాషింగ్‌టన్ డి.సి

డియర్ శ్రావణ్!

మేమందరం కులాసా. మీరు కులాసా అని తలుస్తాను. నాన్న రాసిన లెటర్ అందింది. వెంటనే జవాబు రాయలేకపోయాను. చాలా బిజీగా వుంది లైఫ్ యిక్కడ. నాన్నగారి రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అవీ వచ్చాయని తలుస్తాను. వాటిని ఎలా డిపాజిట్ చేశారు. బహుశా అమ్మ పేరు మీద డిపాజిట్ చేసి వుంటారు. నామినీగా నా పేరు కూడా వుండేట్లు చూడు, అంతా నువ్వే లాగెయ్యకు.

అమెరికాలో వున్నాడు కదాని, నేనేదో లక్షలు సంపాదిస్తున్నాననుకోకు. యిక్కడ మన కాలాన్ని యింకొకళ్ల కోసం అమ్ముకున్నంత సేపే సుఖం. అందులో ఆత్మగౌరవం అనేది



పూర్తిగా మర్చిపోవాలి.

నీ మరదలు కూడా ఉద్యోగంలో చేరింది. పరిస్థితి అలా అలావుంది. వదినా, పాపబాగున్నారని తలుస్తాను. యిప్పుడిప్పుడే ఇండియా వచ్చే వీలు లేదు, అంత అవసరం కూడా కనిపించడం లేదు.

నాన్నను, అమ్మను అడిగానని చెప్పు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ గురించి మర్చిపోకు.

వుంటాను.

– రాము

***

నరసరావుపేట

ది. 12.02.1999

డియర్ రాము,

నీ లెటర్ అందింది అందరూ బాగానే వున్నారు నేను నా కుటుంబం తప్ప. నాన్న రిటైర్ అవగా వచ్చిన డబ్బుని జాయింట్ ఎకౌంట్‌లో వేసుకున్నాడు. పెన్షన్ మాత్రమే మాకిస్తున్నాడు. నా ప్రాక్టీసు కూడా అంతంత మాత్రంగానే వుంది. వీళ్లిద్దరికీ ఆరోగ్యాలు అసలు బాగోవు. మళ్లీ నా వైద్యం పనికిరాదు. వేరే డాక్టర్లు కావాలి. మందులకి దానికీ చాలా అవుతోంది. నువ్వు కొంచెం అయినా సరే డబ్బు పంపించాలి. నేను కూడా ఫ్యామిలీని విజయవాడ షిఫ్ట్ చేద్దామనుకుంటున్నాను. పాపను వచ్చే సంవత్సరం రెసిడెన్షియల్ కాలేజీలో చేరుద్దామనుకుంటున్నాను. ఎమ్.సెట్ కోచింగ్ యిప్పించాలి. మరదల్ని బాబును అడిగినట్లు చెప్పు.

ఇట్లు

శ్రావణ్

పి.యస్: డబ్బు పంపించడం మర్చిపోకు

***

ది. 04.05.1999

వాషింగ్‌టన్ డి.సి.

అన్నయ్యకు,

మేము కులాసా, విజయవాడ షిఫ్ట్ అవుతానని రాశావు. అదే మంచిది. మాకూ యిక్కడ ఆర్థికంగా యిబ్బందిగా వుంది. యిద్దరం సంపాదిస్తున్నా చాలడం లేదు. మొన్ననే ఫ్లాట్ తీసుకున్నాం. దానికి పేమెంట్ కట్టాలి. బాబు కోసం ప్రత్యేకంగా ఓ కేర్ టేకర్‌ని పెట్టాం. యిదీ పరిస్థితి. అందువలన ప్రస్తుతం నేను డబ్బే మీకు పంపలేను. నువ్వొక పనిచేస్తే బాగుంటుందని నా సలహా. నాన్న పెన్షన్‌లో కొంత మొత్తం అమ్మితే ఎక్కువమొత్తం చేతికి వస్తుంది. దాన్ని ప్రసుత్తం నీ అవసరాలకు ఉపయోగించుకో.

నాన్న పెన్షన్ కూడా నువ్వే వాడుకుంటున్నావు కాబట్టి, వాళ్ల బాధ్యత కూడా నువ్వే తీసుకోవాలి. ప్రస్తుతానికి అమ్మ నాన్న యిద్దరూ వున్నారు కాబట్టి, ఒకళ్ల గురించి ఒకళ్లు జాగ్రత్త తీసుకుంటారు. నువ్వు, వదిన ప్రత్యేకంగా సర్వీస్ చేయనక్కరలేదు. మీరు పాప చదువు మీద దృష్టి పెట్టండి. ప్రస్తుతం ఇండియా వచ్చే ఆలోచన లేదు. అమ్మను నాన్నను అడిగానని చెప్పు.

నా ఇ-మెయిల్ అడ్రస్ యిస్తున్నా, యిక నుంచి ఆ అడ్రస్‌కు రాయి.

వుంటాను

– రాము

అన్నట్లు బ్యాంకు డిపాజిట్ గురించి ఒకసారి ఆలోచించు. నాన్నతో మాట్లాడి సెటిల్ చేయించుకుంటే బాగుంటుంది, ఆలస్యం అయితే మళ్లీ ఏదైనా ప్రాబ్లం రావచ్చు.

***

విజయవాడ

ది. 14.07.1999

రాముకి,

మేము కిందటి నెలే విజయవాడ షిఫ్టయ్యాం. నువ్వు చెప్పిన విధంగా నాన్న చేత కొంత పెన్షన్ అమ్మించాను. అయినా పరిస్థితి

అలాగే వుంది. వీళ్ల ఆరోగ్యాలు కూడా మాకు చాలా న్యూసెన్స్‌గా వున్నాయి. చాకిరీ చేయలేక మీ వదిన చస్తోంది.

ముఖ్యంగా రాసేదేమంటే – నాన్న పెన్షన్ బెనిఫిట్స్ మనిద్దరి పేరు మీద జాయింట్ ఎకౌంట్ వేయడానికి ఒప్పించాను. దీనికోసం వాళ్లిద్దరికీ కొంచెం స్ట్రాంగ్ ట్రీట్‌మెంట్ యివ్వాల్సి వచ్చింది. సరే, ఈ లెటర్‌తో పాటు పంపే డాక్యుమెంట్లు సంతకం చేసి వెంటనే పంపు.

నేను కూడా ఇ-మెయిల్ అడ్రస్ యిస్తున్నా వీలున్నప్పుడు ఉత్తరాలు రాయి.

–శ్రావణ్

***

ది. 27.11.1999

విజయవాడ

రాముకి,

మేం ఎలావున్నా, నువ్వు మాత్రం బాగున్నావని తలుస్తాను. నాన్న ఆరోగ్యం బాలేదు. హార్ట్‌లో ఒక వాల్వ్‌పోయింది. పరిస్థితి తేడాగా వుంది. అమ్మకేమో కీళ్ల నొప్పులు, హై.బీపీ, వీళ్లకి సేవచేయడంతోనే మాకు జీవితం తెల్లారి పోతోంది. నువ్వు మాత్రం హాయిగా అమెరికాలో సుఖంగా వున్నావు. ఆపరేషన్‌కి సుమారు రెండు లక్షలపైనే అవుతుంది. నాన్న మన పేరు మీద వేసిన జాయింట్ ఎకౌంట్ లోంచి ఆపరేషన్‌కు డబ్బిమ్మని అమ్మ ఒకటే గొడవ పెడుతోంది. ఏ విషయం తేల్చు, మనిద్దరం సంతకం చేస్తే తప్ప డబ్బు డ్రా చెయ్యలేము.

మొన్ననే యిక్కడ అపార్ట్‌మెంట్ కొన్నాను శ్రీనగర్‌కాలనీలో, మూడు లక్షలు అప్పయింది, అయితేనేం చాలా బాగుంది. వీలు చూసుకొని జవాబు ఇవ్వగలవు.

శ్రావణ్

***

ది. 12.01.2000

వాషింగ్‌టన్ డి.సి.

అన్నయ్యకు,

నాన్న ఏవరేజ్ లైఫ్‌టైమ్ అయిపోవచ్చింది. ఆపరేషన్ చేయించినా, మహా వుంటే మరో ఐదేళ్లు బతుకుతాడు. ఆపరేషన్‌కు రెండు లక్షలు ఖర్చు యిప్పుడు అవసరమా? ఆలోచించు పుట్టపర్తిలో సత్యసాయిబాబా హాస్పిటల్‌లో ఆపరేషన్ ఫ్రీగా చేస్తారని తెలిసింది. ఆ విధంగా ప్రయత్నించు.

–రాము.

పి.యస్: అమ్మకు నేనీవిధంగా రాశానని చెప్పకు కాన్ఫరెన్సుకు జర్మనీ వెళ్లాడట అని చెప్పు.

***

ది. 22.04.2000

విజయవాడ

రాముకు,

నిన్ను అర్జంట్‌గా మెయిల్ చూడమని ఫోన్ చేసిన కారణం, అది వివరంగా ఫోన్‌లో అయితే చాలా ఖర్చువుతుందని.

అసలు విషయం ఏమిటంటే అమ్మకు నిన్న రాత్రి సివియర్‌గా హార్ట్‌స్ట్రోక్ వచ్చింది. ప్రస్తుతం గవర్నమెంట్ హాస్పిటల్‌లో వుంది. పరిస్థితి అనుమానంగా వుంది. హాస్పిటల్‌లో చేర్పించిన తర్వాత కూడా మళ్లీ స్ట్రోక్ వచ్చింది. యింకో స్ట్రోక్ వస్తే బతకడం కష్టం అని నాకూ తెలుసు.

అసలు సమస్యేమిటంటే, మేం మొన్ననే ప్లాట్ కొనుక్కున్నాం. యిప్పుడీవిడకు ఏదైనా అయితే ఏంచేయాలో తెలీడం లేదు. నాన్న కూడా బాగా షాక్‌లో వున్నాడు. బాడీని తీసుకెళ్లి యింట్లో పెట్టుకోలేం. కొత్తగా కొనుక్కున్న యిల్లు కదా! మా సెంటిమెంట్లు మాకుంటాయి.

కనుక నువ్వు వెంటనే బయలుదేరి వస్తే చివరిచూపైనా దక్కుతుంది.

అన్నయ్య

***

23.04.2000

అన్నయ్యకు,

నీ ఇ-మెయిల్ చూసి చాలా షాకయ్యాను. నాన్న పోతాడేమో అనుకున్నాము కానీ, అమ్మకు యిలా అవుతుందని అసలు ఊహించలేదు.

నీ సమస్య కూడా అర్థం అయింది. ఒకవేళ అమ్మపోతే, మళ్లీ కొత్తింటికి తీసుకు వెళ్లి, అక్కడంతా నానా తతంగం చేయించి నువ్వు అనవసరంగా హైరానా పడటం కన్నా బాడీని మార్చురిలోనే ఉంచి, మన వాళ్లందరికీ ఫోన్ చేయి, అటునుంచి అటే మహాప్రస్థానం వ్యాన్ ద్వారా బాడీని శ్మశానానికి తీసుకెళ్ళొచ్చు.

మన వాళ్లందరూ హాస్పిటల్ దగ్గరే బాడీని చూస్తారు, టైం కూడా కలిసొస్తుంది.


నేనుంటుంది గుంటూరో, హైదరాబాదో కాదు వెంటనే బయలుదేరి రావటానికి, అయినా నేనొచ్చినా అమ్మ బతకదు కదా! అలాంటప్పుడు నేను రావడం వల్ల ప్రయోజనం ఏమిటి? పెద్ద కొడుకువు నువ్వున్నావు కనుక జరిపించాల్సిన కార్యక్రమం జరిపించు. ఖర్చులో నా వాటా ఎంతో నీకు పంపిస్తాను (ఖర్చు మరీ ఎక్కువ పెట్టకు).

అమ్మ పోవడం మాకూ చాలాబాధగా వుంది. నాకో చిన్న సాయం చేయగలవని కోరుతున్నాను. అమ్మ, పోయింతర్వాత శవానికి స్నానం చేయించడం, పాడెకట్టడం, దింపుడు కళ్లెం, తలకొరివి పెట్టడం లాంటి ముఖ్యమైన కార్యక్రమాలు ఎవరయినా మంచి వీడియోగ్రాఫర్ చేత షూట్ చేయించి పంపు. ఆ విధంగానైనా అమ్మ అంతిమ యాత్రను చూసే అదృష్టం మాకు దక్కుతుంది. ఆవిడ రుణం తీర్చుకున్నట్లు ఉంటుంది.

–రాము

పి.యస్: ఇప్పుడు రాలేదని ఏమీ అనుకోవద్దు. అమ్మపోయిన షాకుతో నాన్న ఎట్లాగూ ఎక్కువ కాలం బతకడు, అప్పుడు ఎలాగయినా రావలసిందేగా!

*




రచయిత సెల్ నెం: 93945 33761